సుందరమూ, నీలమూ, ఉజ్వలమూ అయిన వసంతాకాశంలోకి ఎక్కడినుంచో ఒక కాల మేఘం వచ్చి ఎలా వ్యాపిస్తుందో, అలాగే ఆమె హృదయాకాశంలోకి ఎక్కడి నుంచో ఒక మేఘం వచ్చి చటుక్కున అంధకారమయం చేసింది- ఈ మాట వినగానే ఆరో జల్లా వాళ్లకి నిద్రాహారాలు లేవు. సీత విచారానికి అంతం లేదు. గోపాలం కూడా లోపల్లోపల కుమిలి పోతున్నాడు.

ఈ విషయం తెలిసి కేశవరావు వచ్చాడు. సంగతంతా విన్నాడు.

"నావల్ల ఏ తప్పూ లేందీ ఎందుకు తీసేశారో అర్థంకావటంలేదు కేశవా! ఆఫీసు పని బాగానే చేస్తున్నాను. ఒక్క రిమార్కు కూడా రాలేదు. మరి ఈవిధంగా ఏకారణమూ చెప్ప కుండా ఎందుకు తీసేశారో అడిగినా ఎవరూ చెప్పలేదు. రేపు ఎవరో ఇంకొక కొత్తఅతను జాయినవుతాట్ట. అతను ఇంటరు మాత్రమే ప్యాసగూడు. మూడువందలు లంచం తిన్న మేనేజరు కూడా ఏ సమాధానమూ చెప్పలేదు" అన్నాడు గోపాలం విచారంగా.

"ఏ విరుద్ధకాల ప్రభావంలో ఈ సన్నివే శంలోకి లాగబడి ఆవృతమయావో, నీకు తీరని నష్టం సంభవించింది గోపాలం. మూడువందలూ ఖర్చుచేసినందుకు మూడు నెలలూ ఉద్యోగం చేశావు. మూడునెలలు చాకిరీ చేస్తే ముప్ఫయి రూపాయలు సంపాదించగలిగా వన్నమాట. డబ్బు తిన్నా సహాయం చేద్దామనే బుద్ధి ఏ కోశానా లేకపోయింది, మేనేజరుకు. పోయిందని తెలిశాక ఆఫీసులో కనుక్కున్నాను. ఎవరో ప్రజాప్రభుత్వాధికారి తరఫు చుట్టానికి నీ ఉద్యోగం ఇచ్చారుట" అన్నాడు కేశవరావు కోపోద్దీపితమైన కంఠంతో.

"మూడువందలూ కాజేసి మూడు నెలలు ఉద్యోగం ఇచ్చి, మానోట్లో దుమ్ముకొట్టి ఎవరో ప్రజానాయకుడు సిఫారసు చెయ్యగానే ఆయన తరఫువారికి ఈ ఉద్యోగం ఇస్తారా!" అన్నది సీత అత్యంతావేదనతో. ఇద్దరూ సీతవైపు జాలిగా చూశారు.

# ఆత్మవంచనలోని హాయి

రావు

నాగరాజు బి. యే. ప్యాసయినట్లు తెలిసింది—దానితో తన జీవితంలో ఒకఘట్టం అయి నట్లుంది. అది విద్యాఘట్టం; ఇక ఎంత ప్రయ త్నించినా అంతకుమించి చదువలేడని తెలుసు. అంతవరకు చదవడంకూడా ఎన్నోకష్టాల్ని ఎదు ర్కొంటూ, వాళ్ళవీళ్ళ సహాయంతో జరిగింది. ఇక పై చదువులు పెద్ద పట్నాలు వెళ్ళి చద వాలి. వాటికి ఆశించడం నిష్ప్రయోజనం అని బాగా తెలుసు.

విద్యాఘట్టం పూర్తయిందో లేదో, అప్పుడే ఇంట్లో 'పెళ్ళి' అనడం మొదలు పెట్టారు. నాగరాజు తండ్రికంటే తల్లికి తొందర ఎక్కు వైంది రాజుకు వివాహంచేయడం విషయంలో. ఇక ఊరుకోలేక ఒకరోజున భోజనం చేస్తుం డగా తండ్రి 'రాజూ! చదువు పూర్తయింది కదా. ఇక పెండ్లిమాట తలపెట్టవచ్చునా?' అని అడిగాడు. అప్పుడు రాజు 'ఏం పెండ్లండీ? ఎన్నో కష్టాలతో చదువు పూర్తయింది. ఇంట్లో ఉన్నదికాస్తా తుడిచిపెట్టుకుపోయింది యీ చదు వుతో. ఇప్పుడు పెండ్లయినా అప్పులతో జరుగు తుంది కదా, ఎందుకు? ఇంకో నెలో రెండు నెలలో ఆగితే నేను పనిలో ప్రవేశిస్తాను. అప్పుడు మన జీవితాలకు కొంత వీలు కనిపిస్తుంది. ఆపైన అప్పు చేసి పెండ్లి చేసుకున్నా తీర్చగలమనే ధైర్యం ఉంటుంది.' అని అన్నాడు. తండ్రి ఆ మాటమీద ఏమీ అనలేక 'సరే నీ యిష్టం' అని ఊరుకున్నాడు.

బి. ఏ. రెండవ సంవత్సరం చదువుతూనే గవర్నమెంటు పరీక్షకు వెళ్ళివుండటంవల్ల, రాజుకు ప్యాసయిన నెలరోజులకే ఉద్యోగం

వచ్చింది. పోస్టింగుకూడా అదృష్టంవల్ల వాళ్ల ఊళ్లో తాలూకా ఆఫీసులోనే పడింది. బియ్యే ప్యాసయి,ఉద్యోగంచేస్తూ,పెళ్లియీడుకు వచ్చిన యువకుడు ఉన్నాడంటే, ఈరోజుల్లో కట్నా లిస్తామంటూ సంబంధాలమీద సంబంధాలు రావడం ఆశ్చర్యం కాదు. ప్రతివాళ్లూ చదువు కున్నవాడిని అల్లుడుగా చేసుకుందామని కోరు కుంటారు, వాళ్ల అమ్మాయి సుఖపడుతుంది కదా అని. రాజుకుకూడా సంబంధాలు వస్తు న్నాయి. రాజమండ్రీనుంచి ఒకాయన వచ్చి 5000 రూపాయలు కట్నం, రెండెకరాల పొలం యిస్తా నన్నాడు. ఇంకో ఆయన వచ్చి 'నాకు ఒక్కగాను ఒక్క కూతురు- ఆస్తంతా యిచ్చి యిల్లరికం ఉంచుకుంటాను' అన్నాడు. ఈ సిరిసంపదలతో కూడిన ఆహ్వానాలకు రాజు ఏమీ చలించలేదు. రాజుతండ్రి మాత్రం వీటిలో ఏదోఒకదానికి మాట యిద్దా మను కున్నాడు కాని భార్యవల్ల ఆగిపోయాడు. ఆమెకు అన్నయ్య కుమార్తెనే కోడలుగా చేసుకుందా మని కోర్కె. అందువల్ల ఎట్టి సంబంధమైనా వదలుకుంటోంది.

ఒకరోజున పెండ్లివిషయాలు మాట్లాడుతూ నాగరాజు తల్లి ''మామయ్యగా రమ్మాయిని పెళ్లి చేసుకుంటావా రాజూ? అందచందాలుగల చక్కనిపిల్ల. అందంతో పాటు బుద్ధిమంతు రాలు. థర్డ్‌ఫారం చదివిందికూడా. అన్ని విధాలా నీకు తగిన పిల్ల. అందులో ఆయినవాళ్ళ సంబంధం ఇది. నీ వుద్దేశం ఏమిటి?'' అని అడి గింది. రాజు ఏ సమాధానం చెప్పకుండా అక్కడ నుండి లేచి వెళ్లాడు. అట్లా లేచి వెళ్లడం అది మొదటిసారి కాదు. తల్లి ఎప్పుడు పెండ్లిసంగతి మాట్లాడినా, అసమ్మతిని తెలియజేసినట్లుగా అక్కడ నుంచి వెళ్లిపోతూ ఉంటాడు. అట్లా వెళ్లడం తల్లి మనస్సుకు కష్టంగా ఉంటుంది.

నాగరాజు మామగారిల్లు ఎక్కడో కాదు. వాళ్ల యింటి ముందే ఉంది. అందువల్ల వాళ్ల నడవడికలు, స్వభావాలు అన్నీ చిన్నతనం నుంచీ నాగరాజుకు తెలుసు. రాజు అత్తగారు కడు లోభి. ఎంగిలి చేత్తో పొరపాటున కూడా కాకిని తోలదు అని ఆమె విషయంలో చెప్పితే ఏమీ అతిశయోక్తి ఉండదు. ఇక మామగారా? అత్తగారి అడుగు జాడలలోనే నడుస్తారు. ఆమె గీసిన గీత ఈయన దాటడు. వీళ్లకుపదెనిమిదియెకరాల పొలం,కొంత రొక్కం ఆస్తి, ఇల్లూ వాకిలీ అన్నీ ఉన్నాయి; ఉండి కూడా పేదరికం అనుభవిస్తారు. నాగరాజు డబ్బు విషయంలో అష్టకష్టాలు పడుతూ చదు వుతూఉంటే,జాలికలిగి కొన్ని వర్తక సంఘాలూ, ఇరుగు పొరుగు వాళ్లూ సహాయం చేశారుగాని, వీళ్లు దమ్మిడీ కూడా రాల్చ లేదు. పోనీ పెండ్లికి ఏమైనా కట్నం యిస్తారా అంటే అటు వంటిది వారి విషయంలో కలలో కూడా జర గదు. ఎవరైనా ఊరుకోలేక నాగరాజు అత్త గారితో ''ఏమమ్మా! రాజుకు కట్నా లిస్తా మంటూ ఎన్నో సంబంధాలు వస్తున్నాయి కదా. మీరు ఉన్నదాంట్లో ఏదో ఒక యెకరం పొలం యిస్తా మనకూడదా'' అని అంటే ఆ యిల్లాలు "మేము కట్నాలు గిట్నాలు యిచ్చేటంత భాగ్యవంతులం కాదు. ఇష్టముంటే మా అమ్మాయిని యిచ్చుకుంటాం, లేకపోతే లేదు. నాగరాజు చేసుకోపోతే మా అమ్మాయికి మొగుడే దొరకడా? మాకు తగ్గ వాళ్ళే మాకు వస్తారు'' అని అంటుంది. ఇటు వంటి వన్నీ చూస్తూ నాగరాజు ఏవిధంగా అంటాడు, మామగారమ్మాయినే వివాహం చేసు కుంటానని? ఒకప్పుడు తల్లితో రాజు 'నాకు మామయ్యగారమ్మాయితోనే పెళ్ళి చెయ్యా లని స్థిరపరచుకున్నారంటే, పెళ్ళిరోజున యింటి దగ్గర ఉండకుండా ఎక్కడికైనా వెళ్ళిపోతా' నని అన్నాడు. ఈ మాటలు నవ్వుతూ అంటు న్నాడు అనుకుంది తల్లి.

వచ్చే మాఘమాసంలో ఎట్లాగైనా రాజుకు వివాహం చెయ్యాలని నిశ్చయించుకున్నారు. అందువల్ల వాళ్ళకీ వీళ్ళకీ మధ్య రాయబారాలు జరుగుతూ ఉన్నాయి. రాజు తండ్రి యిద్దరు పెద్ద మనుష్యుల్ని—ఏదో ఒక యెకరం పొల మైనా యిచ్చేటట్లు ఒప్పించడానికి — రాజు మామగారింటికి పంపాడు. వాళ్లు చిల్లి గవ్వ అయినా యివ్వమన్నారు. రాజు తండ్రికి కోపం వచ్చింది. కాని భార్య ముఖం చూచి ఊరు కున్నాడు. రాజు తల్లి మాత్రం ఏమైనా సరే

అన్నకుమార్తెనే కోడలుగా చేసుకుంటానికి దృఢ నిశ్చయం చేసుకుంది.

శుభముహూర్తం నిర్ణయించారు. బంధువు లందరికీ శుభలేఖలు వెళ్ళాయి. పెళ్ళి ప్రయత్నాలన్నీ జరుగుతున్నాయి. నాగరాజు తల్లి క్షణం తీరిక లేకుండా అదే యీపని చేయిస్తున్నది. ఇంటిముందు పందిరి వేసి కాగితపు అలంకారాలు కూడా చేయడం ఐంది. నాగరాజు మాత్రం ఎప్పుడూ ఆలోచిస్తూ దిగులుతో ఉన్నట్టుగా ఉంటున్నాడు. స్నేహితులెవ్వరికీ శుభలేఖలు పంపలేదు. నాగరాజు యీ విధంగా ఉంటూన్నది చూస్తూండి కూడా, తల్లి పెళ్లి శుభంగా ఐతే అంతే చాలునని మనస్సులో వెయ్యిదేవుళ్ళకి మొక్కుకుంటూ ఉంది. రేపు ఉదయం 8 గంటలకు శుభముహూర్తం. ఆరాత్రి నాగరాజు నిద్ర పోకుండా తన గదిలో కూర్చుని ఆలోచిస్తున్నాడు. పెళ్లి చేసుకోవడమా? మానడమా? అనే క్లిష్టసమస్యను గూర్చి ఎంత ఆలోచించినా తేలడం లేదు. ఈ సమస్యలో రెండు పరస్పర వ్యతిరేక శక్తులు పనిచేస్తున్నాయి. తల్లికోర్కె తీర్చడానికి అత్తమామల నడత సహించడమా? లేక అత్తమామల అవినీతికి దూరంగా ఉండడానికి తల్లిమాటను తిరస్కరించడమా? ఎంత ఆలోచించినా నాగరాజు ఒక నిర్ణయానికి రాలేకపోతున్నాడు.

తెల్లవారుజామున నాలుగు గంటలకు ఆ వూరునుంచి బయలుదేరే ఒక రైలు ఉంది. ఆ రైలులో ఎవరితో చెప్పకుండా ఎక్కడికైనా వెళ్ళదామని నాగరాజు నిశ్చయించుకున్నాడు. టికెట్టుకొని రైలులో కూర్చున్నాడు. రైలు కదిలింది. నాగరాజు మళ్లీ ఆ సమస్యను గూర్చి ఆలోచించడం మొదలుపెట్టాడు. ఆయన మనస్సులో రైళ్లు పరుగెత్తు తూన్నట్లుంది. ఇప్పుడు అతని ఆలోచన మరొక మార్గంలో నడుస్తూంది. "తల్లిమాటకు ఎదురు నడుస్తున్నాను. చిన్నప్పటి నుంచీ ఎన్నో అవస్థలుపడి పెంచి పెద్దవానిని చేసిన తల్లిమాటకు నేడు వ్యతిరేకంగా నడుస్తున్నాను. సర్వదా నా శ్రేయస్సునే కోరుతూ కంటికి రెప్పవలె కాపాడుతూ వచ్చిన తల్లిమాటను వినకుండా నే నిప్పు డెక్కడికి ప్రయాణం? అత్తమామలు లోభులనీ, కట్నం మేమీ యివ్వలేదనీ పెళ్ళి మానుకొని, తల్లికి తీరని దుఃఖాన్ని కలుగజేయడానికి నేనిట్లా బయలుదేరడమా? ఏది ఎట్లా ఉన్నా అందరూ కర్మ ఆడించినట్లు ఆడవలసిందేగదా! నా అదృష్టరేఖ ఏవిధంగా వుంటే ఆవిధంగానే జరుగుతుంది. ఛీ! యింతమాత్రం తెలివిలేకుండా, తల్లిదండ్రులకు తీరని దుఃఖం కలుగజేస్తూ ఈ విధంగా ఎక్కడికో పిరికివాడిలా పారిపోవడమా? ఇదిఎంత తెలివితక్కువ పని!" అని ఆలోచించి తిరిగి యింటికి వెళ్ళడమే మంచి దనుకున్నాడు.

ఇంటికి వచ్చేటప్పటికి ఉదయం ఏడుగంటలయింది. తల్లి విచారంతో ఒకచోట కూర్చుంది. తండ్రి రాజు ఎక్కడికి వెళ్ళివుంటాడా అని ఆలోచిస్తూ చాలా కంగారుగా వున్నాడు. ఇరుగు పొరుగువాళ్లూ, వచ్చినబంధువులూ నాగరాజును గురించి, అతని అత్తమామలగురించి చెప్పుకుంటున్నారు. నాగరాజు అత్తమామలు ఇదంతా వాళ్ళవలన జరిగిందని సిగ్గుపడుతున్నారు.

నాగరాజు వచ్చి ముందుగా తల్లికాళ్ళమీద పడి "నేను చాలాతప్పుపని చేశా నమ్మా! నీమాటకు వ్యతిరేకంగా నడచి యింతవరకూ నీమనస్సు కెంతో కష్టం కలిగించాను. నీయిష్టంవచ్చినట్లుగా నా వివాహం చెయ్యి. నిజంగా నీమాటకు ఎదురు చెప్పను" అన్నాడు. విచారంతో కూడిన కన్నీటి బిందువులు ఆనంద బాష్పాలుగా మారాయి,తల్లికి కుమారుని ఆ మాటలువినేటప్పటికి. "ఎప్పటికైనా బయటి సంబంధం కంటే అయిన వాళ్ళతోనే పొత్తుకుంచిది రాజూ!" అని తల్లి అంది కన్నీరు తుడుచుకుంటూ. ఆ నాడు సక్రమంగా ఎనిమిదిగంటలకు రాజు వివాహం ఐంది మేనమామ గారమ్మాయితో. ఎందువల్లనో కానీ వివాహం అయిన తరువాత నాగరాజుకి వాళ్ళమామ ఒక యకరం పొలం వ్రాసి యిచ్చాడు. చివరికి అందరి వాంఛలూ సిద్ధించాయి.